క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

అంబాజీపేట: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు జరుగుతాయన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం ఆర్జిత సేవగా స్వామి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డు ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కూడా కల్పించింది. సూపరింటెండెంట్ విజయ సారథి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బాక్సింగ్ కోచ్‌కు పీహెచ్‌డీ ప్రదానం



మధుకుమార్

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన బాక్సింగ్ కోచ్ బొంతు మధుకుమార్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ప్రదానం చేశారు. వ్యాయామ విద్యా విభాగంలో శరీర కూర్పు, కొవ్వు, అధిక రక్తపోటుపై మధుకుమార్ పీహెచ్‌డీ చేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులను ఎంపిక చేసుకుని ఈ పరిశోధనలు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవ సభలో మధుకుమార్‌కు ఈ అవార్డును అందజేశారు. ప్రొఫెసర్ ఎస్.విజయ్ మోహన్ ఆధ్వర్యంలో తాను పైన పేర్కొన్న పరిశోధనలు చేశానన్నారు. పలువురు మధుకుమార్‌ను అభినందించారు.

ప్రైవేట్ స్కూల్ జోనల్ చైర్‌పర్సన్‌గా ఉమారాణి



టి.ఉమారాణి

ఆలమూరు: కోనసీమ జిల్లాలోని మండపేట జోనల్ ప్రైవేటు స్కూల్స్ మేనేజిమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్‌గా మండలంలోని చెముడులంకకు చెందిన షిర్డీ సాయి విద్యాసంస్థల అధినేత టి.ఉమారాణిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. షిర్డీ సాయి విద్యానికేతన్ ఆవరణలో జరిగిన జోనల్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజిమెంట్ సమావేశంలో కొత్తపేట, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందిన పది మండలాల్లోని 140 మంది స్కూల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా వి.రాంబాబు, కోశాధికారిగా పి.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. నూతన కార్యవర్గాన్ని సహచర సభ్యులు అభినందించారు.

ఏపీజీఈఎఫ్ కో-చైర్మన్‌గా లక్ష్మణరావు



లక్ష్మణరావును అభినందిస్తున్న అధ్యాపకులు

మలికిపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) కో-చైర్మన్‌గా మండలంలోని కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు ఎన్నికయ్యారు. కాకినాడలో జరిగిన ఎన్నికల్లో ఈ మేరకు తనను ఎన్నుకున్నారని లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కార్పొరేట్ స్థాయిలో సీహెచ్‌సీ నిర్మాణం

- రూ.5.98 కోట్లతో రూపుదిద్దుకున్న ప్రభుత్వాసుపత్రి
- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ



ఆలమూరులో నిర్మించిన 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి భవనం



సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి భవనంలో ఏర్పాటు చేసిన బ్లాక్‌లు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. దశల వారీగా రూ.కోట్ల వ్యయంతో ఆస్పత్రులు నిర్మిస్తూ పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తుంది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి నెలా రెండు సార్లు గ్రామాలకు వెళ్లి వైద్యాధికారులు సేవలు అందిస్తున్నారు. అదే విధంగా వైద్య సేవలను మరింత విస్తరించేందుకు వీలుగా రూ.5.98 కోట్లతో ఆలమూరులో చేపట్టిన 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి భవనం (సీహెచ్‌సీ) రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకొంది. ఈ భవనాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సకాలంలో నిధులు మంజూరు చేయించి నిర్దేశించిన సమయాని కంటే ముందుగానే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పూర్తి స్థాయిలో వైద్యారోగ్య సిబ్బంది నియామకానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చల్లా మునీశ్వరమ్మ నేతృత్వంలో పాలకవర్గం నిర్మాణ పనులు పరిశీలిస్తూ అత్యంత నాణ్యతతో నిర్మించేందుకు కృషి చేశారు. ఒక మాదిరి చికిత్సకు పట్టణాలకు వెళ్లే అవకాశం లేకుండానే ఈ ఆస్పత్రిలోనే అన్ని సేవలు పొందేందుకు వీలు కలగడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా..

ఆలమూరులో సుమారు ఎకరం భూమిలో సువిశాలంగా నిర్మించిన ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవనం(సీహెచ్‌సీ) కార్పొరేట్ స్థాయి కంటే మిన్నగా నిర్మించారు. మూడు అంతస్తుల భవనంలో 42 బ్లాక్‌లను నిర్మించారు. రోగులకు ప్రత్యేక వసతులతో 30 పడకలను ఏర్పాటు చేశారు. గాలి, వెలుతురు సక్రమంగా అందే రీతిలో తీర్చిదిద్దారు. ఆస్పత్రిలో ఇప్పటికే 45 మంది వైద్యారోగ్య సిబ్బందిని నియమించారు. అందులో ఐదుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లతో పాటు అదనంగా శస్త్రచికిత్స నిపుణులు, రేడియాలజీ, పీడియాట్రిక్ విభాగాలను నెలకొల్పారు. అధునాతన పరికరాలతో కూడిన ల్యాబ్‌ను ఏర్పాటు చేసి ఇద్దరి లాబ్ టెక్నీషియన్లను నియమించారు.

ఆస్పత్రి నిర్మాణంతో పేదలకు మేలు

కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సహకారంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీహెచ్‌సీతో పేద ప్రజలందరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు వీలు కలిగింది. వైద్య సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తాం.

– చల్లా మునీశ్వరమ్మ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, ఆలమూరు



అధునాతన సౌకర్యాలతో..

రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సౌకర్యాలతో సీహెచ్‌సీని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. రేయింబవళ్లు ప్రజలందరికీ మెరుగైన వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటాం. మహిళలకు ప్రత్యేక వైద్య సదుపాయాలను కల్పించేందుకు ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం.

– పి.గోపీరామ్, వైద్యాధికారి, సీహెచ్‌సీ, ఆలమూరు



ఎడతెరిపి లేని వర్షం



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం



మామిడికుదురులో జలమయమైన రెండవ వీధి రోడ్డు



పి.గన్నవరంలో కురిసిన భారీ వర్షం

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో పలుచోట్ల రోడ్లపై భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. కాలనీలను సైతం ముంపు ముంచెత్తింది. భారీ వర్షంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. మామిడికుదురు రెండో వీధిలో ప్రధాన రహదారిపై మూడడగుల మేర వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధ్వానంగా ఉన్న బి.దొడ్డవరం–పెదపట్నంలంక ఆర్ అండ్‌బీ రోడ్డు భారీ వర్షానికి మరింత దెబ్బతింది. ఈ రోడ్డుపై పలు చోట్ల భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో 216వ నంబర్ జాతీయ రహదారిపై వర్షం నీరు భారీగా చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. మామిడికుదురు ఆల్ క్యాస్ట్ కాలనీ, మొగలికుదురు వీవర్స్ కాలనీ, పాశర్లపూడిబాడవ సత్తరువుతోట కాలనీ, మాకనపాలెం కాలనీలో భారీగా ముంపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముంపునకు గురైన పొదలాడ కాలనీ

రాజోలు: భారీ వర్షం కారణంగా పొదలాడలోని బీసీ కాలనీ ముంపునకు గురైంది. దీంతో సోమవారం కాలనీలో ముంపునీరు తొలగించే పనులు చేపట్టారు. ముంపు నీరు దిగేందుకు మార్గాలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే కాలనీ మునిగిపోతుందని కాలనీవాసులు వాపోయారు. కాలనీ డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితిని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దృష్టికి తీసుకుని వెళ్లామని స్థానిక నాయకులు లిఖితపూడి బుజ్జి, కంబాల చంద్రరావు, గెడ్డం సురేష్‌లు తెలిపారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అల్పపీడన ప్రబావంతో సోమవానం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని పలు పల్లపు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులపైనా వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ముక్కామల తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు వర్షపు నీటికి మునిపోయాయి. జెడ్పీ హైస్కూళ్ల క్రీడా ప్రాంగణాలు చెరువును తలపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. రోడ్ల పక్కన వెలసిన చిరు వ్యాపారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పాటు చలిగాలులు వీయడంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

పి.గన్నవరం: మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి. ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. పలు గ్రామాల్లో రోడ్లు జలమయం మునిగాయి. ఎడతెరిపి లేని భారీ వర్షంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. మడికి గ్రామానికి చెందిన బీసీ నేత యనమదల నాగేశ్వరరావు అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్‌గా వెత్సా సురేష్ కుమార్, 14 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తూరులోని ఎస్‌జేఆర్ కల్యాణ మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఏఎంసీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

13న యువ కబడ్డీ సిరీస్ పురుషుల జట్టు ఎంపిక

రావులపాలెం: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే యువ కబడ్డీ సిరీస్‌కి పురుషుల జట్టు ఎంపిక ప్రక్రియ ఈనెల 13వ తేదీ బుధవారం రావులపాలెం కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ)లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక సీఆర్‌సీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. 13 తేదీ ఉదయం 9 గంటలకు సీఆర్‌సీలో జరిగే ఎంపికకు ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారుల బరువు 80 కేజీలు లోపు, వయసు 23 ఏళ్ల పైబడి ఉండాలన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 97040 63555, 9492099969 నంబర్లలో సంప్రదించాలన్నా రు. సమావేశంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రట రీ యలమంచిలి శ్రీకాంత్, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్ రెడ్డి, తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ చేమలూరి మణివీరకంఠరెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్‌లో సహాయ కార్యక్రమాలు

కొత్తపేట: మణిపూర్‌లో దాడులకు గురైన ప్రాంతాల్లో ప్రజలకు పలు క్రిస్టియన్ సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. స్థానిక పాతరామాలయం చర్చి పాస్టర్, బీబీసీ సేవకుడు రెవ వైఎస్ ప్రదీప్, డాక్టర్ సైలస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సహాయ ఫౌండేషన్, క్రిస్టియన్ మైనార్టీ యాక్టివ్ కమిటీ, క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్, కాంపేషన్ ఆఫ్ హెచ్‌ఐవీ సంస్థల సహకారంతో 12 మంది సభ్యులు కలసి 'గుడ్ సమరిటన్' టీమ్‌గా మణిపూర్‌లోని పలు జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి మెడికల్ కిట్స్, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. పాస్టర్ ప్రదీప్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా తరపున వెళ్లి సహాయ, సహకారాలు అందించడం దేవుని కృప అని అన్నారు.

కర్మ సిద్ధాంతాన్ని ఎవరూ తప్పించలేరు



ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: చేసిన పాపాలు ఊరికే పోవని, కర్మ సిద్ధాంతాన్ని ఎవరూ తప్పించలేరని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు, ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఎమ్మెల్యే సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. టీడీపీని స్థాపించిన ఎన్టీ రామారావును మానసికంగా వేధించి ఆయన మరణానికి కారణమైన చంద్రబాబుకు తగిన శిక్ష పడిందన్నారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు అతని కుటుంబ సభ్యులను చిత్ర హింసలకు గురి చేసిన చంద్రబాబుకు ఆ కుటుంబ శాపం తగిలిందన్నారు. 2014లో సీఎం అయిన తర్వాత చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని గుర్తు చేశారు. తాత్కాలిక రాజధాని పేరిట కొన్ని రూ.కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. చంద్రబాబు జీవితమంతా స్కాంలు, కుంభకోణాలేనని ఆరోపించారు. నేను నిప్పుని అని చెప్పుకునే చంద్రబాబు అసలు నిజ స్వరూపం ప్రజలకు అర్థమైందన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబునాయుడు తన కేసులపై ఉన్న స్టేలను ఎత్తివేయించి తన నిజాయితీని నిరూపించుకోవాలని చిట్టిబాబు హిత బోధ చేశారు.

ఎమ్మెల్యేకు ఎంపీ పరామర్శ



ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న ఎంపీ అనురాధ

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది నగరంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును సోమవారం అమలాపురం ఎంపీ చింతా అనురాధ పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని, అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆమె అభిలాషించారు. ఎంపీతో పాటు జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు ఉన్నారు.

మాజీ ఎంపీపీ సుబ్బిరెడ్డి మృతి



చిన్నం సుబ్బిరెడ్డి (ఫైల్)

రావులపాలెం: మండల మాజీ ఎంపీపీ చిన్నం సుబ్బిరెడ్డి (79) ఆదివారం రాత్రి కన్నుమూశారు. రాత్రి పది గంటల సమయంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని రావులపాలెంలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సుబ్బిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 1995లో రావులపాలెం మండల అధ్యక్షుడిగా సుబ్బిరెడ్డి ఎనలేని సేవలు అందించారు. సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు



పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. వై.కొత్తపల్లి వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేటకు చెందిన పి.కిరణ్ ఆర్థిక సాయంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, డాక్టర్ పి.కోటేశ్వరరావు, నాయకులు నల్లా పెదకాపు, రావూరి సత్యనారాయణ, నేలపూడి రామకృష్ణ, తోరం సూరిబాబు, ఆకాశం చిట్టిబాబు, కొర్లపాటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని కూర్మం



కూర్మం ఆకారాన్ని తలపిస్తున్న చెట్టుపై అల్లుకున్న పొదలు

రాయవరం: ప్రకృతిని పరికిస్తే అన్నీ అందాలే కనిపిస్తాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా వర్షాలకు డొంకలన్నీ తీగలతో అల్లుకుని, పచ్చదనంతో కొత్త అందాలను సృష్టిస్తున్నాయి. మండలంలోని మాచవరం గ్రామం వద్ద కాకినాడ–మండపేట రహదారిపై అల్లుకున్న డొంక కూర్మాన్ని తలపిస్తోంది. తాబేలు ఆకారంతో అల్లుకున్న పొద ప్రయాణికులను అలరిస్తోంది.

బంద్‌కు కరవైన స్పందన

- తెరచుకున్న షాపులు
- యథావిధిగా నడచిన బస్సులు



రావులపాలెం మార్కెట్ రోడ్డులో షాపులు తెరచి విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

ఆలమూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ చేసినందుకు నిరసనగా ఆ పార్టీ శ్రేణులు సోమవారం చేపట్టిన రాష్ట్ర బంద్‌కు స్పందన కరువైంది. ఆందోళనకారులు పాఠశాలలను, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, ప్రభుత్వ కార్యాలయాలను మూసి వేయించారు. వ్యాపార సంస్థలు యథావిధిగా పనిచేశాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు యథావిధిగా తిరిగాయి. మండలంలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం మామిడికుదురు బస్టాండ్ కూడలిలో టీడీపీ, జనసేన నేతలు రాస్తారోకో చేశారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై నిల్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరం ఎస్సై పి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అక్రమంగా అరెస్టు చేసిన చంద్రబాబునాయుడును తక్షణమే విడుదల చేయాలని మండల టీడీపీ, జనసేన నాయకులు స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. షాపులను, బ్యాంకులను, ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను టీడీపీ నాయకులు బలవంతంగా మూయించివేశారు. ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించడంతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో బంద్ ప్రభావం ఎక్కడ కనిపించలేదు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ పి.గన్నవరంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు సోమవారం ఉదయం షాపులను, బ్యాంకులను, పాఠశాలలను మూయించి వేశారు. మధ్యాహ్నం నుంచి షాపులు తెరచుకున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ, జనసేన నాయకులు నినాదాలు చేశారు.

రాజోలులో..

రాజోలు: నియోజకవర్గంలో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. ముందస్తుగానే రాజోలు, తాటిపాక, మలికిపురం ప్రాంతాల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో టీడీపీ నాయకులు మాట్లాడడంతో ఒక పూట షాపులు మూసివేశారు. అయితే పాఠశాలలకు ముందస్తుగానే సెలవు ప్రకటించారు. రాజోలులోని తహసీల్దారు, ఎంపీడీఓ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు వద్దకు వెళ్లి నినాదాలు చేసి కార్యాలయాలు మూసివేయాలని ఆందోళన చేశారు. పోలీసులు రంగ ప్రవేశంతో కార్యాలయాలు యథావిధిగా పని చేశాయి. ప్రజలను ఇబ్బందులకు గురి చేసి, శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ గోవిందరాజు తెలిపారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం మండలంలో టీడీపీ, జనసేన పార్టీలు నిర్వహించిన బంద్ పాక్షికంగా జరిగింది. ఇరు పార్టీల నాయకులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. మిత్ర పక్షాల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. వేర్వేరు గ్రామాల్లో కమర్షియల్ బ్యాంకులను మూయించి వేశారు. కాగా వేకువ జామున నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షం కారణంగా సఖినేటిపల్లి, సఖినేటిపల్లి మూడు తూములు, అంతర్వేది రోడ్డు, టేకిశెట్టిపాలెం కూడళ్లల్లో వ్యాపార సముదాయాలు అరకొరగా తెరుచుకున్నాయి.

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలో బంద్ పాక్షికంగా కనిపించింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కొంతమేర వ్యాపారులు షాపులు తీయలేదు. ఉదయం పదిగంటల సమయంలో టీడీపీ నాయకులు షాపులు మూయించి వేయడంతో కొద్ది సేపు వ్యాపారులు షాపులను మూసివేశారు. మధ్యాహ్నం నుంచి వ్యాపారులు షాపులను తెరిచి విక్రయాలు సాగించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు యథావిధంగా నడిచాయి.



